# ఓ మగాడి కథ

బి.నాగకుమారి కథ

అనుక్షణం అనుమానాలతో హింసించే భర్తను ఆమె భరించిందా? ఎదిరించిందా?

**నాంది:—**

నాతి'చెరా'మి.

నాతి'చెరా'మి.

నాతి'చెరా'మి.

పెళ్ళికొడుకు ఉచ్చారణలో అపశ్రుతి ఆనందంగా మెలికలు తిరుగుతోంది. ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఎవ్వరి హడావిడి వారిదే. ఎన్ని పెళ్ళిళ్ళు జరిపించినా, ఎంత ఎక్స్‌పీరియన్స్ ఉన్నా హైరానా పడి పోతున్నాడు పురోహితుడు. వచ్చిన ఆహూతులూ అలాగే ఉన్నారు. ఇంతదాకా ఎందుకు? సదరు పెళ్లికొడుక్కే తెలీదు. తనంత బాగా పదం అర్థం మారేంత చక్కగా ఉచ్చరిస్తున్నానని.

"హాయ్ వీనస్! కంగ్రాట్స్" ఓ రామదండు కదలివచ్చి కోరస్‌గా చెప్పింది పెళ్ళికూతురికి. 'ఇంతాలస్యంగానా రావడం' వీనస్ ఆనందంగా విసుక్కుంది. ఆ అమ్మాయి పేరు వీనస్ కాదు సుశీల. అందంగా వుంటుందని స్నేహితులంతా ముద్దుగా వీనస్ అని పిలుస్తారు. "యూ ఆర్ రియల్లీ మార్వెలస్ కాకి ముక్కుకు దొండపండులా.... మీ ఆయన అంత నలుపేమిటే..." ఓ అమ్మాయి గుసగుసగా అడుగుతుంది. మిగిలిన వారు నవ్వుతూ ఆ అమ్మాయి నోరు మూయిస్తున్నారు. సుశీల విరునవ్వు నవ్వింది. పెళ్ళికొడుకు చూపులు గబగబ రామదండు వైపు మళ్ళాయి. పట్టు చీరల పడతుల కన్నా ఆరడుగుల అబ్బాయిల సంఖ్యే ఎక్కువగా ఉంది. పెళ్ళికొడుకు ఇబ్బందిగా కదలసాగాడు. పంచెకట్టువల్ల తలపాగావల్ల కలిగిన ఇరుకుదనం కాబోలు



ననుకుంది పెళ్ళికూతురు. కానీ, మనసే ఇరుకైపోయి ఇబ్బంది పెడ్తుందని అనుకోలేదు. నుదురు చిట్లించి, ముటముట లాడుతూ, అయిందానికీ కానిదానికీ, పురోహితుడ్ని విసుక్కుంటుంటే చమటవల్ల కలిగిన చికాకేమో ననుకుంది. కాని చపల ఆలోచనలు కలగడంవల్ల అని అప్పుడే ఎలా ఊహిస్తుందా పెళ్ళికూతురు?

ప్రస్తావన:—

పాలగ్లాసుతో లోపలికి ప్రవేశించిన సుశీలవైపు రెప్పవేయకుండా గుచ్చిగుచ్చి చూసాడు రఘురాం. బదులుగా చిరునవ్వు నవ్వింది సుశీల. ఆ నవ్వులో ఎన్నెన్నో భావాలు భాషకందని భావాలు. మనస్సుంటే కళ్ళు మాత్రమే చదవగలిగే భావాలు. కాని రఘు ఆమెను శల్యపరీక్ష చేస్తున్నట్లు అదే పనిగా చూస్తూ పరుసుగా అడిగాడు.

"ప్రకాశ్ ఎవ్వరు?"

"నా క్లాస్‌మేట్" చిరునవ్వు.

"అంతేనా?"

"ఫ్రెండ్‌కూడా" అదే చిరునవ్వు, తొట్రుపాటు లేదు.

"ప్లస్ లవర్ కూడానా?"

చిరునవ్వా! నీ అడ్రెసెక్కడ?

"ఏమ్మాట్లాడ్తున్నారండి మీరు?" దిగ్భ్రాంతిగా అడిగింది.

"మరీ అంత స్టన్నయిపోకు. మీ రిద్దరూ ప్రేమించుకున్నారని పెళ్ళి చేసుకోవాలని కూడా అనుకున్నారని ఎవరో ఆకాశరామన్న రాసిన ఉత్తరాన్ని ఇపుడే ఓ చిన్నపిల్లాడు ఇచ్చి వెళ్ళాడు"

"స్టాపిట్ ప్లీజ్... ఇదంతా అబద్ధం" కళ్ళనీళ్ళ పర్యంతమయింది.

"నేనూ అంతే అయ్యుంటుందను కొన్నాను. అందుకే ఆ లెటర్‌ని చదివి ఈ లైటర్‌తో కాల్చేసాను"

కొండంత రిలీఫ్.

"మరయితే పని కట్టుకుని ఉత్తరం రాయాల్సిన అవసరం ఎవరికి ఉంటుదబ్బా? నువ్వు ఎవ్వర్నయినా ప్రేమించావా?" ధర్మసందేహం వెలిబుచ్చాడు. అనుమానం... జస్ట్ అనుమానం.

"ఈ మాంగల్యంసాక్షిగా చెబుతున్నాను. నా జీవితంలో నేనింతవరకు ఏ మగాణ్ణీ ప్రేమించలేదు. కనీసం అలా ప్రేమించాలని కూడా అనుకోలేదు. నన్ను నమ్మండి. నమ్మకంతో సంసారం ప్రారంభిద్దాం. అపుడు నేనే నిరూపించుకుంటా నా సంగతి" సిన్సియారిటీ ఓన్లీ సిన్సియారిటీ.

"దట్స్ గుడ్! నాకు నా భార్య గురించి కొన్ని అభిప్రాయాలున్నాయి. నా భార్య ప్రేమంతా నా సొంతమే కావాలని నా భార్యకు నేతప్ప మరో మగాడు పరిచయముండ కూడదని. నేను చాలా స్వార్థపరుడిలాగా కన్పిస్తున్నానా?"

"నో...నో.. మంచి పొసెసివ్ హజ్బెండ్‌లా కన్పిస్తున్నారు. ఐ లైక్‌యూ"

అరె! ఇంత జరిగాక అందులోనూ మొదటిరాత్రి ఇంత జరిగాక ఆమె గులాబీరంగు పెదవుల్ని వదలడం ఇష్టంలేక కాబోలు... చిరునవ్వు మళ్ళీ వచ్చి ఆమె పెదవులపై చేరింది.

పెళ్ళి పందిట్లో తను విన్న పేరుతో ఇంతగా ఆమెని ప్రశ్నించ గల్గినందుకు తనను తానే అభినందించుకొన్నాడు.

ప్రశ్నలకి అతీతమైన స్వర్గలోకపుటంచుల్ని చేరి వచ్చింతర్వాత సిగరెట్ పీలుస్తూ ఆమెకు భర్తగా మొదటి కాంప్లిమెంటిచ్చాడు.

"దట్స్‌గుడ్. నీకు నిజంగానే

'ఇదే'మిటో తెలీదు- కాకి ఎంగిలో కుక్క ముట్టిన మృష్టాన్నమో అనుకొన్నాను. యూ ఆర్ పర్ఫెక్ట్లీ ఆల్ రైట్''

నిశ్చేష్టురాలైందామె.

* * * *

''సుశీలా! ఇటురా?''

''చెప్పండి'' చిరునవ్వుతో అడిగింది.

''ఏమిటి? మా బావతో ఏదో సరస సల్లాపాలాడ్తున్న ట్లున్నావ్!''

''తప్పండి. అలా అనకూడదు. నాకు అన్నయ్యగారవుతారు మీ బావగారు. ఈ వూర్లో ఏవో సినిమా లాడ్తున్నాయంటే చెబ్తున్నానంతే''

''వాడో గోపాలకృష్ణుడు. కాకపోతే ఎవడో ఓ పిల్లాడ్ని అడగొచ్చుగా. నిన్నే అడగాలా? బైదిబై నువ్వు గోపికవి, రాధవి కావడం నాకిష్టంలేదు''

క్రింది పెదవి నొక్కిపట్టి నిలబడింది.

''ప్రొద్దున నువ్వు మాట్లాడ్తున్న ఆ తెల్లతోలుగా డెవ్వడు?''

''మా రెండో అన్నయ్య. కలకత్తాలో ఉంటున్నాడు. కార్డు లేటుగా అందడంవల్ల ఇవ్వాళొచ్చాడు''

''అఘోరించాడు. ఇక నువ్వెళ్ళి వాడి కౌగిట్లో ఒదిగి అన్ని కబుర్లు చెప్పాలా?''

''ఏమాట్లండి అవి - మా సొంత అన్నయ్య''


''ఫ్రాయిడ్ ఏ మన్నాడో తెల్సా? తల్లి రొమ్ముపాలు త్రాగే వయసులో కూడా మగాడు ఆమె నుంచి లైంగిక పరమైన సుఖాన్ని అనుభవిస్తాడట''

'ది హెల్ విత్ ఫ్రాయిడ్' కసిగా అనుకొంది.

''లోపల పనుంది వెళ్ళనా?'' అక్కడ నిలబడడం ఇష్టంలేక అడిగింది.

''కాస్తంత స్పృహలో ఉండి వాళ్ళు దగ్గరపెట్టుకో. పెళ్ళయిపోయింది కదాని ఏదొచ్చినా మొగుడున్నాడు కదాని క్రిందా, మీదా కానరు మీ ఆడాళ్ళు''

అతని స్వరూపం నెమ్మది నెమ్మదిగా



అర్థమవుతోంటే కాళ్ల పారాణి కూడా ఆరకముందే అతనితో అడ్జస్ట్ ఎలా అవ్వాలో నేర్చుకుంటుందా క్రొత్త పెళ్ళికూతురు.

"ఏమిటిలా వీధిలో నిలబడ్డావ్?" గుమ్మంలోనే ప్రశ్నించాడు.

"మీ రొస్తున్నారేమో చూద్దామని"

"గుమ్మందాకా వచ్చిన వాడిని లోపలకి రానా? చాల్చాల్లే ఇలాంటి రంగసాని వేషాలు నాకు నచ్చవు. లోపలకినడు"

ఆమెకి నోట మాట రాలేదు.

"పెళ్ళికి మా వాళ్ళు పెట్టిన చీర ఈ రోజు కట్టుకో. హోటల్‌లో పార్టీ ఉంది. వెళ్ళాలి"

"నాక్కొద్దిగా తలనొప్పిగా ఉంది"

"ఏం ఫర్లేదు వెయ్యిరూపాయలు పెట్టి అక్కడ డిన్నరిస్తుంటే బోడి తలనెప్పని నువ్వు రాకపోతే ఎలా ఉంటుంది?"

"ఎవ్వరిస్తున్నారు"

"నేనే మా కొలీగ్సందరికీ డిన్నరిస్తున్నాను"

బయల్దేర్తుండగా చెప్పాడు. "మా ఆఫీసులో కొన్ని వెకిలి ముఖాలున్నాయి. జాగ్రత్తగా బిహేవ్ చెయ్యి వాళ్ళతో"

డిన్నర్ జరుగుతున్నంత సేపూ ఆమెని ఓ కంట ఇన్‌స్పెక్షన్ చేస్తూనే ఉన్నాడు. ఆమెకు ముళ్ళమీదున్నట్లుగా ఉంది. లేడీ సైపిస్టు సెకండ్ షోకి రెండు టికెట్లు బుక్‌చేసి వాళ్ళని సినిమాకెళ్ళమని చెప్పడంతో తప్పనిసరిగా సినిమాకెళ్లారు.

"ఓహో! చిరంజీవి సినిమానా?" థ్రిల్లింగ్‌గా అంది తెరమీద చిరంజీవి కన్పించగానే.

అతని ముఖంలో వెంటనే రంగులు మారసాగాయి.

ఆమె సినిమాలో లీనమయ్యింది.

అతడామెనే చూస్తున్నాడు.

"ఇంకెళ్దాం పద" సినిమా చచ్చేంత సస్పెన్సులో ఉండగా అన్నాడు.

"ఏమండీ! ప్లీజ్ కాసేపాగండి.... కనీసం పావుగంట"

"నాన్సెన్స్! నీకు మొగుడొద్దనుకుంటే వాడే కావాలనుకుంటే సినిమా ఆసాంతం చూసి మీ పుట్టింటికెళ్ళు" లేచి నిలబడ్డాడతను.

ఇంటికెళ్ళాక డబుల్‌కాట్ మీద పడుకుని సీలింగ్ ఫాన్ వంక చూస్తున్న ఆమెని అడిగాడు.

"నీకు చిరంజీవి అంటే అంతిష్టమా?"

ఆమె మాట్లాడలేదు.

అతను తన కార్యక్రమం మొదలుపెట్టాడు. అడ్డు చెప్పి ఫలితం ఉండదని ఆమెకు తెలుసు. అందుకే సహకరించింది. స్వర్గ ద్వారాలు తెరుచుకోబోతుండగా అడిగాడతను.

"నా ప్లేస్‌లో చిరంజీవిని వూహించుకొంటున్నావా? ఇంత యాక్టివ్‌గా ఉన్నావ్?"

గబుక్కున వదిలేసింది అతన్ని. అరచేతుల్లో ముఖం దాచుకుని అటువైపు తిరిగింది. ఇటు త్రిప్పే ప్రయత్నమేమీ జరగలేదు.

* * *

ఓ రోజు మధ్యాహ్నం—

ఆఫీసులో రఘురాంకు అనుమానమొచ్చింది ఇంట్లో సుశీల ఏం చేస్తుందోనని. సెలవు పెట్టేసి ఇంటికి వచ్చాడు. గుమ్మం దాకా వచ్చాక బెల్లు కొట్టబోయి చెవి తలుపు కానించాడు.

"ఓ హో దటీజ్ ద టచ్. కమాన్ రవీ... కమాన్ ఐసే" లోపల్నుండి సుశీల గొంతునుండి తన్మయత్వంతో కూడిన ఆహ్వానం.

మైగాడ్! తను అనుకొన్నంతా అయ్యింది. పట్టపగలే ఇంత బరితెగించిందా? ఇంక లాభంలేదు. ఇవ్వాళ అటో ఇటో తేల్చేయాలి. తలుపులు బాదాడు.

అమితానందంలో ఉండగా కల్గిన చిన్న చిరాకుని ముఖంలో కన్పించనీయకుండా తలుపు తీసింది సుశీల. ఎదురుగా రఘు. ఆశ్చర్యబోతూ "ఈ వేళపుడు వచ్చేరేం? ఏదైనా ఫైలు మర్చిపోయారా?"

"కాదు నువ్వు చేసే రంకుతనాలు బట్టబయలు చేద్దామని"

"ఏమండీ..."

"ఏడి వాడు బెడ్ రూంలో ఉన్నాడా? బాత్రూంలో ఉన్నాడా?"

"ఎవ్వరి గురించి మాట్లాడ్తున్నారు మీరు?"

"అదే! ఇందాక కమాన్ రవీ... అంటూ పిలుస్తున్నావ్ చూడు వాడు"

అతని వాక్యం పూర్తికాకముందే పకపకా నవ్వసాగింది. "భలేవారండీ మీరు? ఇంకా ఏమిటో అనుకుని హడలిచచ్చాను. రవి అంటే రవిశాస్త్రి అండి. టీవీలో ఒన్‌డే క్రికెట్ మ్యాచ్ వస్తుంది. రండిమీరు కూడా చూద్దురుగాని" అతని చెయ్యి పట్టుకుని చిన్నపిల్లలా బెడ్‌రూంలోకి తీసుకెళ్ళింది.

"నీకు ఏ ప్లేయరంటే ఇష్టం?"

"రోజర్ బిన్నీ..."

"ఈ మ్యాచ్‌లో ఉన్నాడా?"

"ఆ ఉన్నాడు."

అతని ముఖంలో రంగులు మారుతున్నాయి.

టివీ దగ్గరగా నడిచాడతను. వాల్యూమ్ పెంచడానికి వెళ్తున్నాడేమోనని—

"ఒక్కదాన్నే కదాని వాల్యూమ్ తగ్గించి పెట్టుకొన్నాను. అసలు టీవీలో ఆట చూస్తూ రేడియోలో కామెంటరీ వింటే చాలా బావుంటుంది..." ఆమె చెబుతూనే ఉంది.



## పాస్

ఆర్డినరీ బస్సయినప్పటికీ మహాజోరుగా వెళుతోంది. ఫుల్‌స్పీడులో వెళ్తున్న ఆ బస్సులో వున్న చిదంబరం.

"బస్సు బ్రహ్మాండంగా నడిపిస్తున్నావే డ్రైవరు. డ్రైవింగ్ క్లాసులో ఫస్టున పాసయినట్టున్నావు" అన్నాడు చిదంబరం.

"నేను పాసయినా ఏం లాభంసార్. బ్రేకులు ఫెయిలయ్యాయి" వణుకుతూ అన్నాడు డ్రైవరు.

విజయార్క (వరంగల్)

అతను టీవీ ఆఫ్ చేసాడు.

ఆమె నోరు కూడా వెంటనే మూతపడింది.

"నాన్సెన్స్! ఆడదానికి క్రికెట్ మ్యాచ్‌లేమిటి? ఆ ఆరడుగుల రోజర్ బిన్నీగాడు ఎపుడూ రాత్రిళ్ళు నీ కలల్లోకి కేవలం బ్రీఫ్‌తో వస్తాడా?"

"రామరామ!" చెవులు మూసుకుంటూ లేచి నిలబడింది.

"మీకీ విధంగా తప్ప ఇంకో విధంగా మాట్లాడ్డం రాదా? ఎందుకండి నేనే పాపం చేసానని నన్నిలా అడగడుక్కి వేధిస్తారు? మీకిలాంటి అనుమానాలు ఎందుకొస్తాయసలు? నన్నేం చేయమన్నా చేస్తాను. ఏ శిక్ష విధించినా భరిస్తాను. కాని నన్ను మాత్రం ఇలాంటి అనుమానాల్తో మాటల్తో చిత్రహింస పెట్టకండి" సడన్‌గా ఉన్నట్లుండి ఏడవసాగింది.

"సరేలే ఇంకా సంగీతమాపు. నేనాఫీసుకెళ్తున్నాను. తలుపు వేసుకో" బూట్లు టకటక లాడించుకుంటూ వెళ్ళిపోయాడు.

సుశీల ఏడ్చి, ఏడ్చి సొమ్మసిల్లి అలాగే పడుకొంది.

* * *

ఆఫీసుకొచ్చింతర్వాత ఒక్షణం రఘురాం మనస్సు పీకింది. తను అనవసరంగా సుశీలని బాధ పెడ్తున్నానేమో నని. కేవలం ఒక్కక్షణంమాత్రమే. మళ్ళీ రాయిగా అనుమానాల శిలగా మారిపోయింది. ఆ మనస్సునలా శిలగా మార్చిన పరిస్థితుల్ని మళ్ళీ ఓసారి నెమరు వేసుకోసాగాడు.

ఎనిమిదేళ్ళ వయస్సులో తల్లితో కల్సి అమ్మమ్మ వాళ్ళింటికి వెళ్ళాడు. వాళ్ళది ఉమ్మడి కుటుంబం. రఘుకు నల్గురు మేనమామలు. పెద్దవాళ్ళ ముగ్గురికి పెళ్ళిళ్ళయిపోయాయి. చిన్నతనికింకా కాలేదు. రెండో మేనమామ మిలటరీలో ఉంటున్నాడు. అతని భార్య ఇక్కడే ఉంటుంది.

ఓ రోజు అర్ధరాత్రి రఘు పిన్నతల్లి రఘు రెండో మేనమామ భార్యని నాలుగో మేనమామని ఒకే మంచంలో ఉండటం చూసింది. ఇంకేముంది? ఇల్లు మొత్తం మేల్కొంది. అందరూ నానా మాటలన్నారు ఆవిడ్ని. అత్తగారైతే కోడల్ని కొట్టింది కూడా. తప్పంతా తనొక్కదానిదే అన్నట్లు తలవంచుకుని కూర్చుందామె ఎవ్వరేం అంటున్నా, ఎవ్వరేం చేస్తున్నా రఘు మేనమామ మాత్రం "ఛీ వెధవ కొంప" అంటూ బయటికెళ్ళి పోయాడు.

రఘు మనస్సులో బలమైన బీజం నాటుకుంది అవ్యక్తమైన జుగుప్సాకర అభిప్రాయాల్తో కల్సి.

పదేళ్ళ ప్రాయంలో ఇలాంటి సంఘటనే ఇంకోటి జరిగింది. వాళ్ళ ప్రక్కింటావిడ ప్రసవించడానికని చెల్లెల్ని తోడు తెచ్చుకుంది. ఈవిడ బాలింతరాలై కోలుకునేటప్పటికి ఆవిడ చూలింత రాలవ్వడానికి సిద్ధమైంది. నెత్తీనోరూ బాదుకుని వూరూవాడా ఏకం చేసి చెల్లెల్ని ఇంట్లోనుంచి తరిమికొట్టింది. మొగుడ్ని మాత్రం 'మొగుడి'లాగా చూసుకుంది. అది వేరే సంగతి.

పదహారేళ్ళొచ్చే సరికి రఘు విధవ మేనత్త ఓ క్రిస్టియన్ అబ్బాయితో లేచిపోయింది. కాలేజీలో ఎన్నోరకాల అవమానాల్ని ఎదుర్కొన్నాడు. అపుడే ఆడదాన్ని ఎలాంటి హద్దుల్లో ఉంచాలో నిర్ణయించుకున్నాడు.

చలం పుస్తకాలు, ఫ్రాయిడ్ సైకాలజీ.... అన్నీ చదివి ఆడదాన్ని ఏయే కోణాల్లోనుంచి అణగద్రొక్కాలో చాలా బాగా నేర్చుకొన్నాడు.

కాని అతి మామూలుగా ఇరవైయ్యేళ్ళొచ్చేసరికి ఓ ముస్లిం అమ్మాయిని ప్రేమించాడు. ఆ అమ్మాయికూడా తనని ప్రేమిస్తుందని భ్రమచెందాడు. ఓ రోజు అనుకోకుండా ఆ 'పని' కాస్తా జరిగిపోయి రఘు పశ్చాత్తాప పడ్తుంటే, "ట్యూబ్ లైట్‌లా ఈ పని చెయ్యడానికింత ఆలస్యమా? ఈ పనికోసమే ఎదురుచూస్తున్నా. మంచి ఎక్స్‌పీరియన్స్ ఇచ్చావ్ బై"అంటూ ముద్దుపెట్టుకొని ఆ అమ్మాయి అతని జీవితంలోనుంచి తప్పుకుంది.

రఘుకపుడర్థమైంది ఆడదంటే ఏమిటో. అతని దురదృష్టవశాత్తూ అతని కెదురుపడ్డ ఆడాళ్ళంతా కల్సి అంతమంచి అభిప్రాయాల్ని అతనిలో మిగిల్చారు.

* * * *

"ఏమండీ! మా మేనత్త కొడుకు వచ్చాడు"

"విన్నిద్దామనుకున్నారా?"


"కాదండి. ఈయన చాలా పెద్దవారు. మా నాన్నగారంత వయస్సు ఉంటుంది. మా మేనత్త మాడాడికి కజినవుతుంది"

"అయినా సరే, నాకిలాంటి రాకపోకలు గిట్టవ్" నిష్కర్షగా చెప్పాడు.

ఆరోజు సాయంకాలం, సుశీలా, ఆమె బావా మాట్లాడుతుంటే అతనికి ఒళ్ళు మండిపోయింది. అయినా ఆ క్షణంలో ఏం చేయాలో అర్థంకాలేదు.

రాత్రిమీద చెయ్యివేస్తే సుశీల చెప్పింది. "ఏమండీ! ఈ రోజు ఎందుకో బాగున్నట్లు లేదు. వదిలేయకూడదూ!"

"ప్రతి ఆడదానికీ మగాడిచేత బలవం



## సాలీడు ప్రత్యేకత

పొటాషియం సైనైడు అనే రసాయన పదార్థం అతి ప్రమాదకరమైనది. దీనివి ఎంత తక్కువ పరిమాణంలో తీసి కొన్నా మనిషి మరణించటం ఖాయం. అలాటి విషపూరితమైన పదార్థం సాలీడును ఏమీ చెయ్యలేదనే విషయం మనకు ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది.

పశ్చిమ జర్మనీకు చెందిన నెంట్‌లిగ్ అనే శాస్త్రవేత్త ఈ విషయాన్ని ప్రయోగ పూర్వకంగా రుజువు చేశాడు. అయితే ఈ విషపదార్థాన్ని గ్రహించిన సాలీడు ఆహారపు అలవాట్లు మారాయి. ఫలితంగా మాంసకృత్తులు, పిండిపదార్థాలూ తక్కువ తినటమేగాక, నీటిని కూడా అతి తక్కువగా తీసుకొంటూ కొవ్వు పదార్థాలపట్ల మక్కువ ఎక్కువ చూపించాయి. ఏది ఏమయినా సాలీడు గడుసు పిండమే!

—జూపిటర్

తంగా అనుభవించబడాలని ఉంటుందట. నీకూ అలాంటి కోరికేదైనా కల్గిందా?''

''లేదు బాబూ! ఊర్కుందురూ!''

''అంతేనా! ఆ ముచ్చట మీ బావేదైనా తీర్చేశాడా?''

కరెంట్ షాకైనా సరే, అలవాటైతే... అంతగా షాకొట్టదు. ఇంకోరోజు సుబ్బారావుని చూశావన్నాడు.

కామేశ్వరరావుతో కామించాలను కొన్నావన్నాడు.

.... అన్నాడు ....అన్నాడు.

..... అంటూనే ఉన్నాడు.

* * *

ముగింపు:

ఓ రోజు సుశీల కూర్చుని తీరుబడిగా ఆలోచించసాగింది. అసలీ ప్రహసనానికి అంతు అయిపూ తీరం.... ఏమీ కన్పించడంలేదు. తనే ఏదో ఓ ముగింపు చెప్పాలి.

ఏం చెప్పాలి?

ఏం చెప్పగలదు?

చెప్పి చూపిస్తుంది.

మరో రోజు కరెంట్ బిల్ రాసుకోవడానికి ఓ యువకుడు వచ్చాడు. తల ఎత్తి మీటరు చూసాడంతే. తరువాత పనంతా తలవంచుకుని చేసుకుని వెళ్ళిపోయాడు.

అక్కడే కూర్చుని షేవింగ్ క్రీమ్ రాసుకొంటున్న రఘు డబుల్ ఎడ్జ్ బ్లేడ్‌ని రేజర్‌లోకెక్కిస్తూ అడిగాడు.

''ఏమిటి వాడ్ని అలా తినేసేలా చూస్తున్నావ్?''

భర్తకని తెచ్చిన కాఫీ కప్పుని టీపాయ్ మీద శబ్దమయ్యేలా పెడుతూ ''పైన పడుకున్న ఎన్ని నిముషాల్లో ఇజాక్యులేట్ చేయగలడా..... అని'' అంది.

స్రుమంది బ్లేడు.

''వ్యాట్?''

''కాస్తంత చూసి షేవింగ్ చేసుకోండి''

''ఎంతకు బరితెగించావ్ నువ్వు?.... నిన్ను నిన్నస్సలు...''

''ఊరికే ఆవేశపడకండి. ఏ మగాడ్ని... ఎంతో దూరంలో క్రికెట్ ఆడుతున్న వాడిని చూసినా.... అదేనని అనుమానించి, అనుమానించి, నా బ్రెయిన్‌ని అలా కండిషన్ చేసింది మీరే''

''నోర్ముయ్...''

''నేన్నోర్మూసుకొని కూడా 'ఆపని' చేయగలను''

''నీకు విడాకులిస్తాను''

''మీ ముఖం...''

''ఇంటికి తాళం వేసి వెళ్తానాఫీసుకు''

''డూప్లికేట్ రెండో నిముషానికల్లా చేయించి, ఇంకోడ్ని ఇంట్లోకి పిలించుకోగలను''

''పిలిపించుకుని...''

''ఆమాత్రం తెలీదా నా చవట మగాడా!''

అతనికి మాటలు రావడంలేదు.

''నాకు ఉద్యోగం వచ్చింది. ఇవ్వాళే జాయినవ్వాలి. పిచ్చిపిచ్చి ఆలోచనలు, అనుమానాలు మానేసి సరిగ్గా ఉంటే ఉండండి. లేకపోతే నేనే ఓ పదిమందితో తిరిగి మీకు మగతనం లేదని అందుకే నేనలా తిరుగుతున్నానని చెప్పగలను. కాఫీ తాగండి చల్లారిపోయింది'' ఠీవిగా నడుస్తూ లోపలికెళ్ళింది.